సమాచారం

నేటి నుంచి ట్రాఫిక్ మళ్లింపు

అల్వాల్: జీహెచ్‌ఎంసీ చేపట్టిన బాక్స్ డ్రైనేజీ నిర్మాణ పనుల కారణంగా అల్వాల్‌లో నెల రోజుల పాటు ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందని ట్రాఫిక్ అధికారులు తెలిపారు. రెడ్డి ఎన్‌క్లేవ్, జ్యోతినగర్ నాలా వద్ద బాక్స్ డ్రైనేజీ నిర్మాణ పనుల వల్ల ప్రధాన రహదారిపై రాకపోకలు నిలిపివేస్తున్నారు. దీంతో అల్వాల్ చౌరస్తా నుంచి మచ్చబొల్లారం సెలక్ట్ టాకీస్, జయప్రియ మీదుగా రాజీవ్ ప్రధాన రహదారికి వెళ్లే వాహనాలను ఓల్డ్ అల్వాల్ ఇందిరాగాంధీ విగ్రహం నుండి శ్రీ బేకరీ మీదుగా తెలంగాణ తల్లి విగ్రహం వైపు మళ్లిస్తున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఉప్పల్: ఉప్పల్ 11కేవీ వరంగల్ జాతీయ రహదారి రోడ్డు పనుల కారణంగా మంగళవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఉప్పల్ మెయిన్ రోడ్డు, లక్ష్మారెడ్డి కాలనీ, రాఘవేంద్ర కాలనీల్లో విద్యుత్ సరఫరాను ఉండదని ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

వారాంతపు సంత

మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని కాకతీయనగర్, మూడుగుళ్ల ప్రాంతాలలో మంగళవారం లైబజార్ (వారాంతపు సంత) జరుగుతుంది.

వైద్య సేవలు

అల్వాల్, మల్కాజిగిరి, జవహర్‌నగర్, మౌలాలి ప్రభుత్వ ఆసుపత్రులలో మంగళవారం దంత పరీక్షలు, కంటి వైద్యం, జనరల్ చికిత్సలు నిర్వహిస్తారు.

క్లుప్తంగా..

త్వరలో అత్యాధునిక వైద్య పరికరాల ఏర్పాటు



మాట్లాడుతున్న డాక్టర్ కమల

మల్లాపూర్: ఆస్పత్రిలో కార్మికులకు మెరుగైన వైద్యాన్ని అందించడానికి వైద్యులు అహర్నిశలు కృషి చేస్తున్నారని నాచారం ఈఎస్‌ఐ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కమల కొనియాడారు. ఈఎస్‌ఐ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం ఆస్పత్రిలో నూతన సంవత్సరం వేడుకలు నిర్వహించి కేక్ కట్ చేశారు. అనంతరం డాక్టర్ కమల మాట్లాడుతూ.. సిటిస్కాన్, ఎంఆర్‌ఐ అత్యాధునిక వైద్య పరికరాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంఓలు డాక్టర్ రజ్వంత్, మధు, వైద్యులు వెంకటేష్ బాబు, మాధవి, దుర్గా పద్మాజ, వెంకట్‌రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య విధుల్లో సిబ్బంది పాత్ర కీలకం



కార్మికులకు దుస్తులు పంపిణీ చేసిన గంగరాజు

బోడుప్పల్: పారిశుద్ధ్య విధులు నిర్వహించడంలో మున్సిపల్ సిబ్బంది పాత్ర కీలకమని జేజీఆర్ హైస్కూల్ కరస్పాండెంట్ జె. గంగరాజు అన్నారు. సోమవారం ఆయన 10 మంది పారిశుద్ధ్య సిబ్బందికి దుస్తులు అందజేసి మాట్లాడారు. నగర పాలక సంస్థ పరిధిలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేందుకు, అంటువ్యాధులు, రోగాల బారిన పడకుండా ఉండేందుకు వీరు చేసే కృషి ఎనలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి విజయకుమారి, ఉపాధ్యాయులు రాము పాల్గొన్నారు.

సీఐపై చర్యలు తీసుకోవాలి

కాప్రా: మహిళా కార్పొరేటర్ పట్ల దురుసుగా ప్రవర్తించిన బంజారాహిల్స్ సీఐ నరేందర్‌పై చర్యలు తీసుకోవాలని టీపీసీసీ కార్యదర్శి సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కార్పొరేటర్ విజయారెడ్డి అరెస్ట్‌కు నిరసనగా సోమవారం బంజారాహిల్స్ పీఎస్‌లో కాంగ్రెస్ నేతలు చేపట్టిన నిరసనలో ఆయన పాల్గొని మాట్లాడారు. న్యూ సంవత్సర శుభాకాంక్షలు, ప్రజా సమస్యలు తెలిపేందుకు రేవంత్‌రెడ్డి వద్దకు కార్పొరేటర్ విజయారెడ్డి వెళ్తే పోలీసులు అడ్డుకుని పీఎస్‌కు తరలించడమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా కార్పొరేటర్ అని చూడకుండా ప్రవర్తించిన సీఐ నరేందర్ తీరు సరికాదన్నారు.

టీఎస్-పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శిగా చైతన్య

ఘట్‌కేసర్: టీఎస్ పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శిగా చౌదరిగూడ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు చైతన్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చౌదరిగూడలో టీఎస్ పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు రాంనాథ్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. టీఎస్-పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రామేశ్వర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ఆనంద్‌రెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు జంగారెడ్డి, జిల్లా సభ్యులు నరేందర్‌గౌడ్, వెంకట్‌రాంరెడ్డి, సాంబమూర్తి పాల్గొన్నారు.



స్వామి వారిని ఉత్తర ద్వారా దర్శనం చేసుకుంటున్న భక్తులు

కోటి పుణ్యాలకు సాటి..

ముక్కోటి



స్వామి వారిని దర్శించుకున్న రజిత పరమేశ్వర్‌రెడ్డి దంపతులు

- వైకుంఠ ఏకాదశికి పోటెత్తిన భక్తులు
- కిటకిటలాడిన ఆలయాలు
- ప్రత్యేక ఏర్పాటు చేసిన ఆలయ కమిటీలు
- ప్రత్యేక పూజల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు



స్వామి వారిని దర్శించుకున్న రామ్మోహన్, శ్రీదేవి దంపతులు

ఉప్పల్: వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని సోమవారం ఉప్పల్‌లోని ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నాలుగు గంటల నుంచి ఆలయాలకు భక్తులు బారులు తీరారు. ఉప్పల్ రామాలయంలో భక్తులకు ఏలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఉప్పల్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి దంపతులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి ఉత్తర ద్వారా దర్శనం చేసుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రామంతాపూర్ ఇందిరానగర్‌లో..

రామంతాపూర్: వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా రామంతాపూర్ ఇందిరానగర్‌లోని శ్రీరమాసహిత సత్యనారాయణ స్వామి దేవాలయం గోకుల్‌నగర్‌లోని కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయం, శ్రీనివాసపురంలోని శ్రీకోదండ రామలింగేశ్వర ఆలయాల్లో సోమవారం ఆయా దేవాలయాల కమిటీలు ఏర్పాటుచేసిన ఉత్తర ద్వారాల నుంచి వెళ్లి భక్తులు స్వామి వార్లను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ కక్కిరేని హరీష్, రామలింగేశ్వర ఆలయ చైర్మన్ కంది ఆగిరెడ్డి, సత్యదేవుని ఆలయ చైర్మన్ కోట్ల నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

మల్లాపూర్ సూర్యనగర్ కాలనీలో..

మల్లాపూర్: వైకుంఠ ఏకాదశి సందర్భంగా మల్లాపూర్ సూర్యనగర్ కాలనీలోని శ్రీ లక్ష్మీగణపతి ఆలయంలో వేంకటేశ్వర స్వామిని ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తెల్లవారుజాము నుంచే బారులుదీరారు. మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గౌరి శంకర్, పద్మారెడ్డి, అంజయ్య, నర్సింహారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, పవన్, పీఆర్.ప్రవీణ్, కుందన్ పాల్గొన్నారు.

- నాచారం హెచ్ఎంటీనగర్ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఉత్తర ద్వారం ద్వారా స్వామి వారిని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు శాంతిసాయిజెన్‌శేఖర్ దర్శించుకున్నారు.

అల్వాల్ బాలాజీ వేంకటేశ్వర ఆలయంలో..

అల్వాల్: వైకుంఠ ఏకాదశి సందర్భంగా అల్వాల్‌లోని బాలాజీ వేంకటేశ్వర ఆలయంలో భక్తులు దైవదర్శనానికి బారులు తీరారు. ఉదయం నాలుగు గంటల నుంచి ఉత్తర ద్వారా దర్శనానికి పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి, రాజ్ జితేంద్రనాథ్, మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్, మాజీ ఎమ్మెల్సీ దిలిప్‌కుమార్, మున్సిపల్ అధికారులు చిన్నారెడ్డి, బాలకృష్ణ, జలమండలి అధికారి సాంబయ్య, వైద్యాధికారి ప్రసన్న, డీఈఓ విజయకుమార్ దైవదర్శనం చేసుకున్నారు.



వైకుంఠ ఏకాదశి సందర్భంగా సత్యవేదునికి అలంకరించిన దృశ్యం

కుషాయిగూడలో..

కాప్రా: వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులు వేంకటేశ్వరస్వామి ఆలయాలకు వెళ్లి స్వామివారిని ఉత్తర ద్వారా దర్శనం చేసుకున్నారు. కుషాయిగూడ వేంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తడంతో స్వామివారి దర్శనానికి సుమారు 2 - 3 గంటల సమయం పట్టింది. స్వామివారిని మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు దర్శించుకున్నారు.

మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్లలో..

కుషాయిగూడ: వైకుంఠ ఏకాదశి సందర్భంగా సోమవారం చర్లపల్లి, మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్లలో ఆలయాలు కిక్కిరిసిపోయాయి. తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తి స్వామివారి దర్శనాలు చేసుకున్నారు. హెచ్‌బీ కాలనీలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలోని స్వామివారిని నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



స్వామిని దర్శించుకున్న ప్రభుదాస్

స్వామి ధర్మదర్శనానికి టికెట్.. భక్తుల ఆగ్రహం

వైకుంఠ పర్వదినం సందర్భంగా భక్తులు ఆరాధ్య దైవంగా భావించే కలియుగ ప్రత్యక్ష దైవం ఉప్పల్ స్వరూప్‌నగర్‌లోని కరిగిరి వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉదయం నుంచి భక్తులు వందలాదిగా తరలివచ్చారు. ధర్మదర్శనానికి వచ్చిన భక్తులు గంటల తరబడి లైన్‌లో ఉన్న తర్వాత ఆలయ గుమ్మం వద్దకు రాగానే టికెట్ తీసుకోవాలంటూ ఆంక్షలు విధించడంతో భక్తులు తప్పని పరిస్థితుల్లో డబ్బులు చెల్లించుకున్నారు. మరి కొందరు వెనుదిరిగి ఇతర ఆలయాలకు వెళ్లినట్లు స్థానిక భక్తులు కొందరు తెలిపారు. ఆలయ నిర్వాహకులు ధర్మదర్శనానికి డబ్బులు వసూలు చేయడం పట్ల స్థానికులు, భక్తులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. గతంలో ఎప్పుడూ లేనిది ఇప్పుడు ఎందుకు దైవ దర్శనానికి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆలయానికి వచ్చిన భక్తులు నిలదీసినా ఫలితం లేకపోయింది. మధ్యాహ్నం టికెట్ తీసుకోకుండా దైవదర్శనం కల్పించినట్లు తెలిసింది. కరిగిరి వేంకటేశ్వర స్వామి దర్శనానికి ప్రతి ఏటా దాదాపుగా ఉప్పల్ పరిసర ప్రాంతాల్లోని 10 కిలో మీటర్ల మేర అనేక ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు. భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని ఆలయ నిర్వాహకులు అనాలోచిత నిర్ణయాలు తీసుకోవద్దని స్థానికులు పేర్కొన్నారు.



మల్లాపూర్‌లో వెంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి



స్వామి వారిని దర్శించుకుంటున్న శాంతిసాయిజెన్‌శేఖర్ దంపతులు



దైవ దర్శనంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్



ఉప్పల్ శ్రీకరిగిరి వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

ముదిరాజ్‌లు ఐక్యంగా ఉండాలి

బోడుప్పల్: ముదిరాజ్‌లు ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కార్పొరేటర్లు బొమ్మక్ సుగుణ, దొంతరబోయిన మహేశ్వరి పేర్కొన్నారు. హేమానగర్ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను సోమవారం వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు చామకూర సురేష్ ముదిరాజ్, కార్యదర్శి శ్రీనివాస్ ముదిరాజ్, నేతలు బొమ్మక్ బాలయ్య, కృపాసాగర్ ముదిరాజ్ పాల్గొన్నారు.



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్లు

రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

మల్లాపూర్: మల్లాపూర్ రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ సంఘం అధ్యక్షులు దోమ శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, కోశాధికారి ముత్యంరెడ్డి, సభ్యులు ధర్మారెడ్డి, వెంకట్ రెడ్డి, విఠల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



సంఘం సభ్యులతో కలిసి కేలండర్ ఆవిష్కరిస్తున్న దేవేందర్‌రెడ్డి

నిధుల విడుదలలో ప్రభుత్వం నిర్లక్ష్యం



పోలీసుల అదుపులో నాయకులు



నందికంటి శ్రీధర్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

అల్వాల్: సర్పంచులకు నిధులు విడుదల చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నందికంటి శ్రీధర్ అన్నారు. ప్రభుత్వ ధోరణిని నిరసిస్తూ కాంగ్రెస్ చేపట్టిన ధర్నాకు అనుమతి ఇవ్వకపోవడంతో పాటు పార్టీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డిని అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఇందిరాపార్కు వద్ద ఆందోళన చేయడంతో పోలీసులు అరెస్టు చేశారన్నారు. పోలీసుల ద్వారా ప్రభుత్వ వ్యతిరేకతను అణిచివేయాలని చూస్తున్నారన్నారు.

ముందస్తు అరెస్ట్

రామంతాపూర్: గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయకపోవడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యమంటూ ఆరోపిస్తూ టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి చేపట్టిన ధర్నాకు వెళ్తున్న యూత్ కాంగ్రెస్ నేతలను ఉప్పల్ పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసుల అదుపులో తీసుకున్న వారిలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కంది శ్రవణ్‌రెడ్డి, సెక్రటరీ వల్లపు కోటేష్, ప్రధాన కార్యదర్శి కిషోర్ ఉన్నారు.

హెచ్చరించినా మారని తీరు!



మద్యం తాగి విధులు నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఏ కిషోర్‌ను అధికారులు చర్లపల్లి నుంచి నాచారంకు బదిలీ చేసి ఇకపై మద్యం తాగొద్దంటూ హెచ్చరించారు. అయినా అలవాటు మార్చుకోకుండా నిత్యం మద్యం తాగుతూనే విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం మద్యం తాగి నాచారంలోని ఓ ప్రాంతంలో ఇలా నిద్రకు ఉపక్రయించాడు. గతంలో కిషోర్ కార్మికుల హాజరు మెషిన్ సైతం పోగొట్టాడని తోటి కార్మికులు పేర్కొంటున్నారు. -మల్లాపూర్

హైకోర్టు అథారిటీ సభ్యుడిగా అనిరుధ్



అనిరుధ్

రామంతాపూర్: రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం లీగల్ సర్వీసెస్ ఆథారిటీ ప్యానెల్ సభ్యునిగా రామంతాపూర్‌కు చెందిన ప్రముఖ న్యాయవాది నెల్లికొండా అనిరుధ్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం అథారిటీ చైర్మన్ ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అనిరుధ్ మాట్లాడుతూ.. లీగల్ సర్వీసెస్ ఆథారిటీ పటిష్టతకు కృషి చేస్తానన్నారు.

నివాళి

హబ్సిగూడ: మాజీ ఎమ్మెల్సీ దివంగత పీవీ చలపతిరావుకు సోమవారం ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే, ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, బీజేపీ నాయకులతో కలిసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుమార్, పాపారావు, బాలచందర్, శాంతికుమార్ నోముల, శ్రీధర్‌గుప్తా పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి



స్థానికులతో మాట్లాడుతున్న ప్రభాకర్

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ కుషాయిగూడ హనుమాన్‌నగర్ కాలనీలో రోడ్డును ఆక్రమించి నిర్మాణం చేపడితే అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ప్రశ్నించారు. కాలనీలో 40 ఫీట్ల రోడ్డును 10 ఫీట్ల మేర ఆక్రమించి 30 ఫీట్లకు కుదించి నిర్మాణాలు చేపడుతున్నారని కాలనీ వాసులు మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ దృష్టికి తీసుకెళ్లడంతో సోమవారం ఆయన కుషాయిగూడలో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు ఆక్రమణకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాలనీ వాసులు సుధాకర్‌రెడ్డి, మధు, శ్రీనివాస్, వెంకటేష్, వెంకట్‌రెడ్డి, సునీల్, కవిత, స్థానిక నాయకులు సురేందర్‌గౌడ్, నాథం, రేగొండ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

లాలాపేట: తార్నాక డివిజన్ సాయినగర్ కాలనీలో స్థానిక మహిళా నేతల ఆధ్వర్యంలో నూతన సంవత్సరం 2023 వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ మేయర్, బీజేపీ రాష్ట్ర నాయకురాలు బండ కార్తీకరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్తీకరెడ్డి మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో సత్తాచాటాలని ఆకాంక్షించారు.

ప్రతిభ చాటిన అక్కాచెల్లెళ్లు



మల్లాపూర్: దేశవ్యాప్తంగా ప్రతిభగల విద్యార్థులకు అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ ముస్లిమ్స్ ఆఫ్ ఇండియన్ వర్జిన్స్ ఆధ్వర్యంలో హైయర్ సెకండరీ స్కూల్ సర్టిఫికెట్లను ప్రతి ఏడాది అందజేస్తోంది. తెలంగాణ రాష్ట్ర నుంచి నాచారం (ఉప్పల్ గర్ల్స్) తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ కాలేజీకి చెందిన ఇద్దరూ విద్యార్థినులు అక్క చెల్లెలు నర్గిస్ సుల్తానా, నఫేస్ సుల్తానా ఎంపికయ్యారు. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో నర్గిస్ సుల్తానాకు బంగారు పతకం, ప్రశంసపత్రం, నఫేస్ సుల్తానాకు రజత పతకంతో పాటు ప్రశంస పత్రాన్ని ఢిల్లీ మాజీ లెఫ్టినెంట్ గవర్నర్ నజీబ్ జంగ్, జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యులు సయ్యద్ షాజుదీ చేతుల మీదుగా అందుకున్నారు. తన పిల్లలు ప్రతిభ కనబర్చడం చాలా సంతోషంగా ఉందని విద్యార్థినుల తండ్రి మహ్మద్ అబ్దుల్ సలాం పేర్కొన్నారు.

ఘనంగా విష్ణు సహస్రనామ పారాయణం



కార్యక్రమంలో పాల్గొన్న లలితా పీఠం పీఠాధిపతులు

మల్కాజిగిరి: వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా సోమవారం మల్కాజిగిరి విష్ణు సహస్రనామ కమిటీ ఆధ్వర్యంలో ఆనంద్‌బాగ్‌లోని బృందావన్ గార్డెన్స్‌లో 1008 మంది ఆస్తికులు, 130 మంది రిత్విక్‌కులతో 11 సార్లు విష్ణు సహస్రనామ పారాయణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం, లలితాపీఠం పీఠాధిపతి బ్రహ్మానంద సరస్వతి స్వామి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కొడకండ్ల రాధాకృష్ణశర్మ, వేధ భవన్ నిర్వాహకులు శ్రీరామ్ ఘనాపాటి, కుప్ప శ్రీనివాస్ శాస్త్రీ, కార్యక్రమం సందర్భంగా పూజ కార్యక్రమాలు, వేదపఠనం చేశారు.

కబ్జాలపై అధికారుల గురి!

సాక్షి ఎఫెక్ట్..

బోడుప్పల్: రాజీవ్‌నగర్ కాలనీలోని గుట్ట కబ్జాకు యత్నిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మేడిపల్లి మండల తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి హెచ్చరించారు. 'గుట్టకు గురి.. అధికారులేరి' అనే శీర్షికతో ఆదివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. ఆదివారం గుట్టవద్దకు చేరుకున్న అధికారులు ప్లాట్‌గా చేసిన భూమిని జేసీబీతో తవ్వి, బేస్‌మెంట్ కోసం వేసిన పునాది రాళ్లను తొలగించిచారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఈ స్థలంలో ప్రభుత్వ స్థలమంటూ బోర్డును ఏర్పాటు చేస్తామన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ప్రభుత్వ స్థలాలను కబ్జా కాకుండా పటిష్ట చర్యలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సునీత, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



గుట్టకు గురి.. అధికారులేరి?

సాక్షిలో ప్రచురితమైన కథనం



కూల్చివేతలు చేపడుతున్న అధికారులు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220376 9912220571
9912225470 9505507657